# ఇది ఒక మంజీర కథకాదు!

- శారదా అశోకవర్ధన్

ఇందిరానగర్‌లో ఓ ఇరుకు సందు నాలుగు పోర్షన్లు ఉన్న అగ్గిపెట్టెల్లాంటి గదులు చివరి పోర్షన్లో కొవ్వొత్తి వెలుగులో కింద చాపమీద కూర్చొని ఆలోచిస్తోంది మంజీర. బయటి చీకటి లాగానే ఆమె మనసంతా దిగులు, భయంతో నిండి పోయి వుంది.

సాయంత్రం నాలుగు గంటల నుంచి అతని కోసం ఎదురుచూస్తోంది. టైం ఇప్పుడు తొమ్మిది గంటలవుతోంది. ఇక రాడు ... ఎనిమిది దాటితే రాడు... ఇంట్లో భార్య అనుమానిస్తుందేమో అనే భయం...

చల్లగాలి రివ్వున వీచింది. పైటకొంగును భుజాల చుట్టూ కప్పుకుంది. ముప్పై ఏళ్ల పరిపూర్ణమైన యవ్వనం, ఆమె శరీరంలోని ప్రతి అవయవంలో కనిపిస్తోంది...

వీధి చివరకు చూపును సారించి చూసింది.

అతనిక రాడు... నాలుగు గంటలకు కరెక్టుగా వస్తానని చెప్పావు. కాని రాలేదు. ఏదో బలమైన కారణం ఉండి ఉండాలి. లేకపోతే ఆగడు. పిడుగులు పడుతున్నా సరే కరెక్టుగా చెప్పినటైంకి వస్తాడు ఇప్పుడెలా ?! ఆకలితో పేగులు మెలితిరిగిపోతున్నాయి...

''ఏంటే మంజీర అట్టాకూకున్నావూ... గిరిబాబు రాలేదా?'' అడిగింది పక్క పోర్షన్‌లో వుంటున్న సావిత్రి.

''రాలేదు పిన్ని ... ఎందుకనో... '' అంది మంజీర.

''లేమరి వంట సేసుకో ... ఆడింక రాడ్లే ... పెళ్లాంచాటు మొగుడు ఆడ్నినమ్ముకోవద్దే అంటే నువ్వు ఇనవాయే... బియ్యం వున్నాయా? అడిగింది సావిత్రి.

''లేవు పిన్ని ..'' అంది మంజీర.

''ఇటు రామరి ఈ పూటకి నాదగ్గరే తిందువుగానీ.. రే పొత్తిడ్లే ఆడు... ఎందో మన బతుకులు చావలేము.. బతకలేము... రాయేరా ఎంత సేపని ఎదురుచూత్తాకూకుంటావ్...'' అంది సావిత్రి...

సావిత్రికి నలభై ఏళ్లుంటాయి. నల్లగా బలంగా వుంటుంది. మంజీర నెమ్మదిగా లేచి ఆమె దగ్గరకు వెళ్లింది. అప్పుడే కరెంటు వచ్చింది.

'' అబ్బ నీ కాలు మోపగానే లైట్లొచ్చాయ్ ... రారా కూకో... '' అంది సావిత్రి సంతోషంగా.

ఆ చిన్న గదిలో ఓమూల కింద పరుపు పరిచి వుంది. దాని పక్కనే చిన్న స్టూలు మీద పోర్టబుల్ బ్లాక్ అండ్ వైట్ టి.వీ ... షెల్ఫ్ నిండా బట్టలు చిందవందరగా పడివున్నాయి... కిటికీలో చిన్న అద్దం.. పౌడర్ టిన్ను ... దువ్వెన ... తిలకం సీసా ... బొట్టు బిళ్ళలు ... సెంటు పరుపు బాటిల్... తదితర మేకప్ సామగ్రి వుంది.

పరుపు మీద గోడకు ఆనుకుని కూర్చుని గ్లాసులోని విస్కీ తాగుతోంది సావిత్రి.

''ఏంటి పిన్నీ నీ పనే బావుందే... భలే ఎంజాయ్ చేస్తున్నావ్... అంది మంజీర నవ్వుతూ.

'' ఆ ఏముందిలే నాబొంద ... నిన్న ఈరోజా షూటింగ్ వుండబట్టి ఏదో ఈ మాత్రం నడుత్తోంది బండి... అవునూ మీ ప్రొడక్షన్ మేనేజరు ఏమంటున్నాడే ... ఈ వారంలో మొదలెత్తారట్నా సూటింగు...'' అడిగింది సావిత్రి గ్లాసు కిందపెడుతూ .

'' అలా అని చెపుతున్నాడు పిన్నీ... మొదలేస్తే బానే వుంటుంది. వరుసగా నెలరోజులు వుంటుందట షూటింగు ...'' అంది మంజీర.

''మంచిదేగా''

''హిరోయిన్ కు వుండాల్సిన లచ్చనాలన్నీ వున్నాయే నీకు. పాపం కాలం కలిసి రాలా ఏంచేద్దాం..,'' అంది సావిత్రి విచారంగా మంజీరను చూస్తూ.

మంజీర నవ్వుకుంది.

ఇద్దరూ జూనియర్ ఆర్టిస్టులే... ఆ వీధిలో దాదాపు అందరూ జూనియర్ ఆర్టిస్టులే వుంటున్నారు.

షూటింగులు జరిగినంత కాలం తిండికీ కరవులేకుండా గడిచిపోతుంటుంది... అవి లేకపోతేనే వాళ్లకి గడ్డుకాలం ... ఎన్నో ఆశలతో ... కలల లోకంలో విహరిస్తూ వస్తారు. కాలం కలిసిరాకపోతే ఇంటికి తిరిగివెళ్లలేక ఇలా జూనియర్ ఆర్టిస్టులుగా కాలం వెళ్లబుచ్చుతుంటారు. మంజీర భోజనం ముగించి ... సావిత్రితో ఓ అరగంట కాలక్షేపం చేసి వెళ్లిపోయింది.

షూటింగ్ ప్యాకప్ అయిపోవడంతో మంజీర వొంటరిగా ఆపార్కు లోని సిమెంట్ బల్లమీద దిగులుగా కూర్చుని ఆలోచిస్తోంది. ఆమెకు చిన్ననాటి మధుర స్మృతులు గుర్తొచ్చి గుండెను గాయం చేస్తున్నాయి... గొంతంతా బాధతో నొప్పి పెడుతోంది. దుఃఖం కట్టలు తెంచుకుని వస్తోంది. ఆమెకు తెలీకుండానే కళ్లవెంట నీళ్లు సుళ్లు తిరుగుతూ రాలిపోతున్నాయి.

ఆరోజుతో షూటింగ్ పూర్తయిపోయింది.

మంజీర ఈ వారం రోజులు నరకయాతన అనుభవించింది. కారణం... అది ఆమె సొంత వూరుకావడం...!

ఆవూరి ప్రజలు వారం రోజుల పాటు గుంపులు గుంపులుగా వచ్చి షూటింగ్ చూసి వెళ్లారు. తనన్నెవ్వరూ గుర్తు పట్టలేదు. ఎలా గుర్తుపడతారు...?! అవకాశమేలేదు.

ఆవూరు వదిలి వచ్చి అప్పుడే దాదాపు పదిహేనేళ్లు అవుతోంది. మంజీరకు అన్నయ్య, అమ్మ గుర్తొచ్చారు. క్రమంగా ఆమె ఆలోచనలు బాల్యంలోకి జారిపోయాయి.

• • •

''ఏయ్ మంజీ త్వరగా రావే... లేకపోతే నేను వెళ్ళిపోతాను'' అంటూ కేకేశాడు భార్గవ

''అమ్మా చూడమ్మా అన్నయ్య వెళ్లిపోతానంటున్నాడు ... త్వరగా జడవేయవే...'' అంటూ ఏడుస్తూ చిందులు తొక్కింది మంజీర.

భార్గవ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు.

మంజీర కంటే మూడేళ్లు పెద్ద... కానీ పదేళ్లు పెద్దాడిలా బిహేవ్ చేస్తాడు.

''మంజీరకు జడలు వేయటం పూర్తిచేసి తన కొప్పులో దువ్వెన దోపుకుని మంజీర ముఖానికి

పౌడర్ అద్దింది కస్తూరి.

''నా బంగారు తల్లిది ఎంత పొడవైన జుత్తు'' అనుకుంటూ ముద్దు పెట్టుకుని ''వెళ్లిరా జాగ్రత్త...'' అని చెప్పింది కస్తూరి కూతురితో.

'' అన్నయ్యా నేను రెడీ...'' అంది మంజీర భార్గవ దగ్గరకు వచ్చి.

భార్గవ సైకిల్ స్పీడుగా తొక్కు కుంటూ పార్క్‌కు తీసుకెళ్లాడు.

అప్పుడు సమయం సాయంత్రం అరుగంటలవు తోంది.

'' మంజి... జారుబండ జారే టప్పుడు జాగ్రత్త ... కాసేపు ఆడుకుని సిమెంట్ బల్లల దగ్గ రకు రా... అక్కడ వుంటాను నేను... '' అని రొటీన్‌గా చెప్పే మాటలు చెప్పి మంజీర బుగ్గ మీద ముద్దు పెట్టుకుని స్నేహి తుల దగ్గరకు వెళ్లాడు భార్గవ.

మంజీర ఓ అరగంట సేపు ఆడుకుని ... అన్నయ్య దగ్గరకు వచ్చింది.

'' అన్నయ్యా వెళదాం ...'' అంది పున్నాగ పూలను వొళ్లో పోసుకుని...

భార్గవ నవ్వుతూ ... చెల్లెలి వొళ్లోవున్న పూలను షర్టు జేబు లలో కొన్ని, ప్యాంటు జేబుల్లో కొన్ని జాగ్రత్తగా దోపుకుని

'' పదవే వెళదాం...'' అంటూ మంజీర చేయి పట్టుకుని నడిపిం చుకుంటూ తీసుకెళ్లాడు.



• • •

అప్పుడు సమయం.

ఆరుగంటలు... పున్నాగ చెట్టు మీద నుంచి పువ్వొక్కటి రాలి మంజీర వొళ్లో పడింది. అది చూసిన మంజీర కళ్లలో నుంచి కన్నీటి చుక్క ఒకటి దాని మీద టప్ మని రాలి పువ్వుని తడిపే సింది.

''ఏయ్ మంజీరా ఏంటిది? ఏడుస్తున్నావా? ఊరుకో... పోనీ మీ ఇంటికెళ్లి మీ అమ్మను పలక రించి వస్తావా? మనసులో బాధ కొంతైనా తీరు తుంది'' అంది సావిత్రి.

సావిత్రికి ఆమె విషయం అంతా తెలుసు.

మంజీర తల అడ్డంగా ఊపింది.

మరయితే పద వెళదాం ...వ్యాను బయలుదేరు తుంది.'' అంది సావిత్రి.


''పిన్ని నాకొక్క సాయం చేసి పెడతావా? మా ఇంటి అడ్రస్ చెపుతాను... నువ్వెళ్లి మా అమ్మను రేపొద్దున రైల్వేస్టేషన్‌కు రమ్మనవా ప్లీజ్ ... అమ్మని చూసి పది హేనేళ్లవుతోంది...'' అంటూ పెద్దగా ఏడ్చేసింది మంజీర.

''పిచ్చిపిల్ల ... ఇంతేగా... సెప్తాలే ఏడ వకు''అంటూ ఆమెను ఆప్యాయంగా దగ్గరకు తీసు కుని తలనిమిరింది సావిత్రి.

''థ్యాంక్స్ పిన్ని... ఇదిగో అడ్రస్సు '' అంటూ పర్స్‌లో నుంచి పెన్ను తీసి ఓ కాగితం మీద రాసి ఇచ్చింది.

''తప్పక వస్తుందిలే... ఎంతైనా తల్లి మనసు కూతుర్ని సూడకుండా వుండగలదా? అసలు మనం వచ్చిన రోజునే ఆమెకు కబురు చేస్తే చక్కగా ఈ వారం రోజులు ఆమె నీతో గడిపేది కదా పొరపాటు సేశావు'' అంది సావిత్రి విచారంగా.

''నన్ను ఈ వేషంలో... ఇంతమంది మధ్య తైతక్క లాడడం చూసి అమ్మ తట్టుకోలేదు పిన్ని. నీకు తెలీదు అమ్మ నన్ను ఎంత అల్లారుముద్దుగా పెంచిందో... పాపిష్టి దాన్ని సినిమా వ్యామోహంలో



## గురుద్వారా!

ప్రపంచంలోనే అతి ఎత్తైన ప్రదేశంలో గల గురుద్వారా ఒకటి హిమాలయాల్లోని నది గట్లపై ఉంది. 5,160 అడుగుల ఎత్తులో ఉందది. దానిని జవాన్లు, ఆఫీసర్లు, పంజాబ్ రెజిమెంట్‌కు చెందినవారు నిర్మించారు.

## ధర్నా!

తిరువనంతపురంలోని సెక్రటేరియట్ ముందు 675 రోజులపాటు జగదన్ అనే అతను ధర్నా చేశాడు. ధర్నాలలో అది ఓ రికార్డ్. మోహన్‌దాస్ అనే హంతకుడ్ని అరెస్టు చెయ్యాలని కోరుతూ జగదన్ ఆ ధర్నా చేశాడు.


## అతి ఖరీదైన పెయింటింగ్స్!

ప్రాచీనమైన 2 పెయింటింగ్‌లు ఆమధ్య వేలంపాటలో అతిపెద్ద మొత్తాలకు పాడబడి, ఓ రికార్డ్ సృష్టించాయి. డిగోడిసిల్వావెలాజ్క్విజ్ అనే చిత్రకారుడు గీసిన చిత్రానికి 8.9 మిలియన్ల డాలర్లు ధనం కురిసింది. నికోలాస్ పాసిన్ పెయింటింగ్‌కు 6.7 మిలియన్ల డాలర్లు లభించింది!

## మహాతిండి!

తకామిసూగీ అనే భారీకాయుడు జపాన్‌లో ఉన్నాడు. అతనొక సుమో రెజలర్. తిండి తినడంలో మహా ఘనుడు. ఒకసారి అతను కూర్చుంటే చాలు ఏకంగా 29 పౌండ్ల మాంసాన్ని ఆరగించేస్తాడు. అతను తింటున్నప్పుడు తన దవడలు నొప్పిపుట్టినప్పుడు మాత్రమే తిండి తినడం ఆపుతాడు. అందువలన అంత తిన్నప్పటికీ అతని పొట్ట ఇంకా ఖాళీగానే ఉంటుంది.

- కొడిమెల




పడిపోయి... ఆ వేణుతో కలిసి హైదరాబాద్ వచ్చేశాను... ఇంట్లో వాళ్లని మోసం చేసినందుకు నాకు తగినశాస్తి జరిగింది'' అంది మంజీర.

''సర్లే అవన్నీ గుర్తుకు తెచ్చుకుని బాధ పడకు... నువ్వు హోటల్ గదిలో వుండు. నేను మీ అమ్మను కలిసి రేపు రమ్మని సెప్తాత్తా'' అంది సావిత్రి.

'' పిన్నీ హోటల్ అడ్రస్ చెప్పకు దయ చేసి ... రేపు పొద్దున ఓ గంట ముందు ఎనిమిదింటికి రైల్వే స్టేషనుకు రమ్మను అమ్మని'' అంది మంజీర ప్రాధేయపూర్వకంగా.

'' అట్టాగేలే...'' అంటూ వెళ్లిపోయింది సావిత్రి.

• • •

మంజీర ఉదయం ఏడున్నరకే స్టేషన్‌కు వచ్చి కూర్చుంది. రాత్రి అసలు ఆమె కంటి మీద కునుకు లేదు. అమ్మ వస్తుందో రాదో... నన్ను గుర్తుపడుతుందో లేదో... నన్ను క్షమిస్తుందో లేదో...

మంజీర దృష్టంతా రోడ్డుమీదే వుంది.

దూరంగా ఎవరో ముసలావిడ మెల్లగా నడుస్తూ వస్తోంది. ఎవరామె అమ్మే అయివుంటుందా?

ఛ... అమ్మెందుకు అవుతుంది?

అమ్మ అప్పుడే అంత ముసలిదయిపోతుందా?... కాదు అమ్మ కాదు... కాకూడదు అనుకుంటూ చూస్తోంది.

మంజీర గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఆమె మెల్లగా వణుకుతూ నడుస్తూ మంజీరను సమీపించింది.

మంజీర గుండె శబ్దం ఆమెకే వినిపిస్తోంది. గుండె గొంతుకలో కొట్టుకుంటుంది.

ఆ...వి...డ... అ...మ్మే!!

కానీ ఆమె మంజీరను ఓ సారి చూసి చూపు ఆననట్లుగా నొసలిపై చేయి పెట్టుకుని చూసి మెల్లగా అడుగులు వేస్తూ దాటిపోయింది.

మంజీర పెద్దగా ఏడ్చింది.

''అమ్మా...'' అంటూ పెద్దగా ఏడవడంతో ... ఆముసలావిడ వెనుతిరిగి మంజీర దగ్గరకు వచ్చి అప్పుడు గుర్తు పట్టింది కూతురని...

''అమ్మా మంజీరా... నా తల్లీ... ఎన్నాళ్లకు చూశానమ్మా... నా చిట్టితల్లీ'' అంటూ ఆమెను వాటేసుకుని బుగ్గలమీద ... నుదుటి మీద ముద్దులు పెట్టుకుంది ఆప్యాయంగా.

''అమ్మా ... నన్ను క్షమించవా అమ్మా...'' అంది మంజీర ఏడుస్తూ.

''పిచ్చితల్లీ నేను మీ అమ్మనమ్మా..'' అంది ఆమె పక్కనే కూర్చుంటూ.

''అమ్మా ఏంటమ్మా ఇలా అయింది యావు? అన్నయ్య సరిగా చూడడం లేదా? అంది అప్యాయంగా ఆమె వొళ్లంతా తడుముతూ.

''బాగానే చూస్తున్నాడమ్మా... నువ్వు లేకపోతే నేను సంతోషంగా ఎలా వుండగలను తల్లీ... పదమ్మా మనింటికి పోదాం... అన్నయ్యకు నేను చెపుతాలే'' అంది కస్తూరి.

''వద్దమ్మా ...నేను అన్నయ్య ముఖం చూడలేను ... అమ్మా ఇదిగో ఈ డబ్బు తీసుకోమ్మా... మందులు కొనుక్కో...'' అంటూ మూడువేల రూపాయలు ఆమె చేతిలో కుక్కింది.

''వద్దు తల్లీ... నాకెందుకమ్మా డబ్బు... నువ్వు ఇంటికి రామ్మా...'' అంది కస్తూరి కూతుర్ని ఆప్యాయంగా చూస్తూ.

'' వస్తానమ్మా ఈ సారి తప్పక వస్తా... డబ్బు జాగ్రత్త... నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో... చాలమ్మా...

ఈ జీవితానికి ఈ అదృష్టం చాలు... నేను నిన్ను చూస్తానో చూడనో అని అనుకున్నాను. నువ్వు దిగులుపడకమ్మా'' అంది మంజీర

ఇంతలో రైలు కూత వినిపించింది.

''మంజీరా రైలొస్తోంది... త్వరగా రా...'' అంది సావిత్రి దూరం నుంచి.

''అమ్మా వెళ్ళొస్తానమ్మా... నావిషయం దిగులుపడకు నేను బానే వున్నాను... నన్ను క్షమించమని అన్నయ్యతో చెప్పమ్మా...''అంటూ కళ్ల వెంట నీళ్లు జలజలా రాలుతుండగా ఆమె వడివడిగా అడుగులు వేస్తూ రైలెక్కింది.

మంజీర తల్లి కస్తూరి అలాగే నిలబడి కూతుర్ని చూస్తోంది.

రైలు క్రమంగా కదిలింది.

''పిన్ని... అమ్మ పిన్నీ ... నన్ను క్ష... మించింది పిన్నీ...'' అంటూ పెద్దగా ఏడ్చేసింది. తల్లి క్రమంగా దూరమయిపోతోంది. రైలు వేగం పెరిగింది. సావిత్రి మంజీర భుజం తట్టి ఆమెను మెల్లగా సీట్లో కూర్చోపెట్టింది.

''నువ్వింకా అదృష్టవంతురాలివే మంజీరా. మీ అమ్మను సూసుకున్నావు... మనలో శానా మంది మళ్లీ ఆళ్ల తల్లితండ్రుల ముఖం సూడకుండా సనిపోయినవాళ్లు వున్నారు. బాధ పడకు... ఎందో సినిమా యామోహంలో వత్తారు. బతుకు సెడగొట్టుకుని కన్నవాళ్ల కోసం ఏడుత్తారు... ఊరుకో...'' అంది సావిత్రి.

మంజీర బాధగా కళ్ళు మూసుకుంది.

★